

నగరాలు, పల్లెల్లోని వీధుల్లో విహరిస్తూ.. అక్కడి ప్రజలు, వారి జీవితం, సంస్కృతిని ఫొటోలు తీయడమే.. స్ట్రీట్ ఫొటోగ్రఫీ. ఆయా సందర్భాల్లో అనుకోకుండా దొరికే అద్భుతమైన క్షణాలను కెమెరాల్లో బంధించే అద్భుతమైన కళ ఇది. మొబైల్ ఫోన్‌తోనే వీధుల ప్రత్యేకతలను, వాటి అందాలను అత్యద్భుతంగా చిత్రీకరించవచ్చు.

# వీధుల్లో విహరిస్తూ..



స్ట్రీట్ ఫొటోగ్రఫీకి సంబంధించి.. ఉత్తమ టెక్నిక్స్, కెమెరా సెట్టింగ్స్, కంపొజిషన్ ఐడియాలు, ఎడిటింగ్ టిప్స్ గురించి తెలుసుకుందాం. తద్వారా మీరు స్ట్రీట్ ఫొటోలను ప్రొఫెషనల్ స్థాయిలో తీయగలిగేలా తయారవుతారు.

స్ట్రీట్ ఫొటోగ్రఫీ అంటే నగరాలు, పల్లెల జీవనశైలి, వీధుల సంస్కృతి, ప్రజల భావోద్వేగాలు, ఆర్కిటెక్చర్ వంటి అంశాలను సహజమైన రీతిలో ఫొటోలు తీయడమే. ఇది అక్కడి ప్రజల నిజమైన కథనాలను చెప్పే ఒక మాధ్యమం. నగరంలో అనుకోని సంఘటనలు, బిజీబిజీగా ఉండే వీధులు, ట్రాఫిక్, గుళ్లు, బజార్లు మొదలైన వాటిని ఫొటోల్లో బంధించవచ్చు. స్ట్రీట్ ఫొటోగ్రఫీ ఎక్కువగా నేచురల్, కాండిడ్ షాట్స్‌పై ఆధారపడుతుంది. మనం తీసే స్ట్రీట్ ఫొటోలు ఒక మంచి కథను చెప్పగలగాలి. మరి అలాంటి స్ట్రీట్ ఫొటోగ్రఫీకి ఎలాంటి సెట్టింగ్స్ వాడితే మంచిది? పదండి తెలుసుకుందాం.

- **హెచ్‌డీఆర్ మోడ్ :** ఇది లైటింగ్, డిటెయిల్స్‌తోపాటు నీడలను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది.
- **ప్రో మోడ్ :** ఐఎస్ఓ, షటర్ స్పీడ్, వైట్ బ్యాలెన్స్‌ను మీరే పూర్తిగా కంట్రోల్ చేయండి.
- **బరస్ట్ మోడ్ :** ఫాస్ట్ యాక్షన్ మూమెంట్స్ (చిన్నారులు ఆడుకోవడం, రోడ్ ట్రాఫిక్, పక్షులు ఎగరడం) క్యాప్చర్ చేయడానికి ఈ మోడ్ మంచి ఆప్షన్.
- **నైట్ మోడ్ :** రాత్రి సమయంలో లైటింగ్ తక్కువగా ఉన్నప్పుడు ఫొటోలు తీయడానికి సాయపడుతుంది.
- **ప్రోటిప్ :** ఫొటోలో వేగంగా కదులుతున్న సబ్జెక్ట్ ఉంటే.. షటర్ స్పీడ్ తగ్గించండి (1/250 – 1/500 sec), ఐఎస్ఓను స్వల్పంగా పెంచండి. ఇది ఫొటోకు మంచి పానింగ్ ఎఫెక్ట్ ఇస్తుంది.

**కంపొజిషన్ టెక్నిక్స్**

- **రూల్ ఆఫ్ థర్డ్స్ :** ప్రధాన సబ్జెక్ట్‌ను ఫ్రేమ్‌లో ఒకపక్కకు ఉంచడం వల్ల.. స్ట్రీట్ ఫొటోలు చాలా బాగా కనిపిస్తాయి. మొబైల్ కెమెరా సెట్టింగ్స్‌లో గ్రిడ్ లైన్స్ ఆన్ చేసి.. రూల్ ఆఫ్ థర్డ్స్‌ను ఫాలో అవ్వండి.
- **లీడింగ్ లైన్స్ :** వీధిలో ఉండే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, మెట్రో ట్రాక్‌లు, వంతెనలు మొదలైన వాటిని ఉపయోగించి.. మీ కంపొజిషన్‌ను ఆకర్షణీయంగా మార్చుకోవచ్చు.
- **ఫ్రేమింగ్ :** కిటికీలు, గేట్లు, బాల్కనీలు, నీడలను ఉపయోగిస్తూ.. మెయిన్ సబ్జెక్ట్‌ను ఫ్రేమ్ చేయండి.
- **రిఫ్లెక్షన్ :** నీటి బిందువులు, కారు అద్దాలు, అద్దాల మేడలపై పడే ప్రతిబింబాలను వాడుతూ.. వీధులను సరికొత్త కోణాల్లో క్యాప్చర్ చేయండి.
- **నెగెటివ్ స్పేస్ :** కంపొజిషన్‌లో ఎక్కువ భాగం ఖాళీగా వదిలి, ప్రధాన సబ్జెక్ట్‌కు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వండి. ఇలా చేయడం వల్ల ఫొటోలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- **ప్రో టిప్ :** వీధుల్లో వివిధ రంగుల అలంకరణలు, గ్రాఫిటీ, దేవుళ్ల చిత్రాలు, కాంతులు వంటి వాటిని ఉపయోగించి.. క్రియేటివ్ షాట్స్ తీసుకోండి.

**బెస్ట్ లైటింగ్**

- **గోల్డెన్ అవర్ (సూర్యోదయం– సూర్యాస్తమయం) :** గోల్డెన్ అవర్‌లో వెలుతురు సున్నితంగా ఉంటుంది. ఇది స్ట్రీట్ ఫొటోలకే కాదు, షాడోస్, లైట్ కాంబినేషన్ కోసం కూడా మంచి సమయం.
- **హార్ష్ సన్‌లైట్ (మధ్యాహ్నం వెలుగు) :** మిట్టమధ్యాహ్నం వేళలో కాంతి ఎక్కువగా ఉంటే.. నీడలను క్రియేటివ్‌గా వాడుకోండి. దీనివల్ల డీప్ కాంట్రాస్ట్ ఉన్న ఫొటోలు అద్భుతంగా వస్తాయి.
- **నైట్ అండ్ ఆర్టిఫీషియల్ లైటింగ్ (నైట్ స్ట్రీట్ ఫొటోగ్రఫీ) :** వీధి దీపాలు, నియాన్ సైన్‌బోర్డులు, వాహనాల లైట్లను ఉపయోగించి కలర్‌ఫుల్, మూడీ షాట్స్ తీయవచ్చు. లాంగ్ ఎక్స్‌పోజర్ ఉపయోగించి లైట్ ట్రైల్స్‌ను ట్రై చేయండి.



- **ప్రో టిప్ :** రాత్రి స్ట్రీట్ ఫొటోగ్రఫీలో ఐఎస్ఓ ఎక్కువగా పెంచకుండా, ట్రైపాడ్ లేదా స్టెడీ హ్యాండ్‌ను ఉపయోగించండి.

**క్రియేటివ్ ఐడియాస్**

- **కాండిడ్ మూమెంట్స్ :** వీధుల్లో ప్రజలను.. వారికి తెలియకుండానే ఫొటోలు తీయండి. అప్పుడే సహజసిద్ధమైన ఎక్స్‌ప్రెషన్స్ క్యాప్చర్ అవుతాయి.
- **కలర్స్ అండ్ కాంట్రాస్ట్ :** వీధుల్లో కలర్‌ఫుల్ సీన్స్‌ను హైలైట్ చేయండి. రంగురంగుల భవనాలు, పురాతన ఇండ్ల ముందు ఉండే పెద్దపెద్ద దర్వాజాలను ఫొటోలు తీయండి.
- **స్మార్ట్ ఫ్రేమింగ్ :** వాహనాల అద్దాల రిఫ్లెక్షన్స్, నదుల నీటిలో ప్రతిబింబాలను వాడుతూ.. భవనాలు, మనుషులను క్యాప్చర్ చేయండి.
- **మోనోక్రోమ్ స్ట్రీట్ ఫొటోస్ :** బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు.. నగర జీవితంలోని ఫీలింగ్స్‌ను మరింత బలంగా చూపిస్తాయి.
- **సిల్హౌట్స్ అండ్ షాడోస్ :** సూర్యోదయం, సూర్యాస్తమయ వేళల్లో సిల్హౌట్ ఫొటోలు అద్భుతంగా వస్తాయి.

**ఫైనల్ వర్డ్స్ :** స్ట్రీట్ ఫొటోగ్రఫీ గొప్ప కళ. ప్రతి నగరానికీ తనకే సొంతమైన ఓ చరిత్ర ఉంటుంది. ఆ నగరపు వీధుల్లో విహరిస్తూ.. ఆ చరిత్రను క్యాప్చర్ చేయండి. ఆ నగర కథను ఫొటోల్లో బంధించండి. సరైన లైటింగ్, కంపొజిషన్, కెమెరా సెట్టింగ్స్‌ను ఉపయోగించి.. ప్రొఫెషనల్ లెవల్ స్ట్రీట్ ఫొటోలు తీయండి. మొబైల్ ఫోన్ తీసుకోండి.. వీధుల్లోకి వెళ్లి అద్భుతమైన మీ నగర కథను ఫొటోలుగా మలచండి! ■

... ఆడెపు హరికృష్ణ